# విముక్తి • జట్టప్రకాష్ రావు

తల్లి కళ్లలో కన్నీరు చూడగానే నాలుగేళ్ల సరిత హృదయం విలవిలలాడింది. "అమ్మా ఏడవ కమ్మా" ఏడుపు గొంతుతో అంటూ తల్లి కళ్ల నుండి కారిన కన్నీటిని తుడవసాగింది.

సరిత గొంతులోని బాధను గుర్తించిన ఇందిర బలవంతంగా ఏడుపు దిగమింగుకొంది.

"నాన్న, తాతయ్య, నాన్నమ్మ మంచివారు కాదు కదమ్మా, ఎప్పుడూ నిన్ను కొడుతూ వుంటారు" అంతకు ముందు వారంతా తన తల్లిని కొట్టడం వల్ల వాచి పోయి ఎర్రగా కందిపోయిన బుగ్గల వైపు, చేతుల వైపు జాలిగా చూస్తూ అంది సరిత.

"తప్పమ్మా పెద్ద వారిని అలా అనకూడదు". అంది ఇందిర.

"తాతయ్య నడిగి డబ్బులు తెచ్చిస్తే నిన్ను కొట్టనన్నారుగా. వెళ్లి తీసుకొని రావచ్చు కదమ్మా" అంది సరిత.

"తాతయ్య దగ్గర డబ్బులు లేవమ్మా" బాధగా సరితను దగ్గరకు తీసుకుంటూఅంది ఇందిర.

"మరి డబ్బులు ఎవరిస్తారు"

"నువు బాగా చదివావంటే ఆ తరువాత పెద్ద ఉద్యోగం వస్తుంది. అప్పుడూ నీకు అంత డబ్బులు ఇస్తారు. ఆ డబ్బులు వీళ్ళకు ఇచ్చేస్తావుగా" అంటూ అడిగింది.

"అలాగే ఇస్తాను" అంది సరిత.

* * *

ఇందిర భర్త రంగనాధం. ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం. వారికి ఇద్దరు సంతానం. నాలుగేళ్ళ వయసుకల కూతురు సరిత, కాన్వెంటులో యు.కె.జి. చదువుతోంది. ఒక సంవత్సరం వయసుగల కొడుకు సతీష్.

పెళ్ళైనప్పటి నుండి ప్రతి సంవత్సరము ఏదో ఒక సాకుతో రంగనాధం డబ్బు అవసరమంటూ ఐదు నుండి పదివేల రూపాయల వరకూ ఇందిరను తీసుకొని రమ్మనేవాడు. భర్త కోరిన విధంగానే తల్లి తండ్రుల నడిగి డబ్బు తీసుకొని వచ్చేది ఇందిర.

రెండవ కాన్పుకై తల్లి తండ్రులుంటున్న గ్రామానికి వెళ్ళింది ఇందిర. సతీష్ పుట్టాడు. అత్తగారింటికి బయలుదేరడానికి కొద్ది రోజుల ముందు భర్త తీసుకొని రమ్మని చెప్పిన ఐదు వేల రూపాయల గురించి తల్లి తండ్రులతో చెప్పింది.

ఇందిర తండ్రి సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. ఇందిర అత్తగారింటికి బయలుదేరు రోజున ఐదు వేల రూపాయలు చేతికిస్తూ "ఇందిరా మా పరిస్థితి కాస్త అర్థం చేసుకోమ్మా. పెళ్ళి కెదిగిన నీ చెల్లెలు, చదువుకొంటున్న నీ తమ్ముడి ఖర్చుల గురించి నీకు చెప్పనక్కరలేదనుకొంటాను. ఈనాలుగేళ్ళు మీ భర్త అడిగిన డబ్బు లేదనకుండా ఇవ్వడంవల్ల ఇంతవరకూ మా కంటూ ఒక్క పైసాకూడా మిగల పెట్టుకోలేక పోయాయి. ఈసారి పంటల్లో కొద్దిగా నష్టం కూడా కలిగింది. ఇప్పుడు నీవడిగిన మొత్తంలో మూడు వేల రూపాయలు అప్పు చేసి తీసుకొని వచ్చాను. ఇక మీదట మీ ఆయన అడగకుండా చూసుకో" అని చెప్పాడు ఇందిర తండ్రి.

"ఇందిరా, ఇక మీదట అడిగినా మేము ఇచ్చే స్థితిలో లేము" అంది ఇందిరతల్లి.

ఇందిర అత్తగారింటికి బయలుదేరింది. సతీష్ వయసు ఒక సంవత్సరము పూర్తి కాసాగింది. తల్లి తండ్రుల సలహామీద ప్లాటు కొనడానికి తక్కువ పడిన పదివేల రూపాయలను ఇందిరను పుట్టింటికెళ్ళి తీసుకొని రమ్మన్నాడు రంగనాధం. ఇందిర తన తల్లి తండ్రుల ఆర్థిక పరిస్థితి తెలిపి వారినిక ఎట్టి పరిస్థితిలోనూ డబ్బులడగదలచుకోలేదని తెలిపింది.

## ఉగాది బాల

రతీపతి వింట వేపపూలు
ప్రతియింట పచ్చ తోరణాలుగాగ
మామిడి మధువులు గ్రోలి
కోకిల గళము విప్పగ
మయూర పింఛము మరిపించు
కోమలాంగులు కోలాటమాడగ
ప్రభాతవేళ ప్రమోద హేల
ఉగాది బాల ఉయ్యాల లూగ!

—చంద్ర

ఇందిర చెప్పింది విన్న భర్త, అత్తమామలకు విపరీతమైన కోపం కలిగింది. ఎలాగైనా సరే ఇందిర చేత ఆ డబ్బు తెప్పించాలనుకొన్నారు. అప్పటి నుంచి అకారణంగా తప్పపట్టడం కొట్టడం ప్రారంభించారు. కొడ్తున్నప్పుడు ఇందిర నన్ను కొట్ట వద్దండి అంటూ వేడుకొంటే "నీవు మేమడిగిన డబ్బులు తీసుకొనిరా. అప్పుడు నిన్ను కొట్టము" అని చెప్పేవారు.

భర్త, అత్తమామలు కలసి తనను డబ్బు కోసం పెడుతున్న కష్టాల నుండి బయటపడటానికి వారితో ఎదిరించే ధైర్యం లేకున్నమా, ఎట్టి పరిస్థితిలోనూ తన తల్లి తండ్రులకు ఇక్కడి విషయాలు తెలియువరచ కూడదన్న మొండి నిర్ణయానికి వచ్చింది. తనకిక ఈ నరకం నుండి విముక్తి లేదనుకొంది. వారై మారితే తప్ప అంతవరకూ ఈ నరకంలోనే గడపక తప్పదనుకొంది. ఇలాంటి సమస్య వస్తే చట్టం ద్వారా పరిష్కరించుకొనవచ్చునన్న ఆలోచన రాలేదు.

* * *

నాలుగు నెలలు గడిచింది. ఎవరిలోనూ ఏ విధమైన మార్పురాలేదు. భర్త అత్తమామలు పెడుతున్న చిత్ర హింసలను ఇందిర భరించుతూనే వుంది.

ఆరోజు మధ్యాహ్నం భోజనం చేసి వచ్చి సీట్లో కూర్చున్న రంగనాధంకు మేనేజరు పిలుస్తున్నాడన్న ఫ్యూను పిలుపు విని మేనేజరు రూములోనికి ప్రవేశించాడు.

"రంగనాథం,నువ్వింతటి నీచుడవనుకోలేదు. డబ్బు కోసం ఇంత కర్కోటకంగా ప్రవర్తిస్తావా. కట్నం కేసులో ఇరుక్కుంటే నీ జీవితానికే కాదు, నీ ఉద్యోగానికి కూడా ముప్పు వస్తుంది. డి.ఎస్.పి. దగ్గర్నుంచి ఫోను వచ్చింది చూడు" అంటూ ఫోను అందించాడు మేనేజరు.

వణుకుతున్న కంఠంతో "సార్, నమస్తే సార్. నేను....రంగనాథంను మాట్లాడుతున్నాను" అన్నాడు.

"ఓ! నువ్వేనా రంగనాథంవి. నేను డి.ఎస్.పి. చక్రపాణిని మాట్లాడుతున్నాను. నీవు నీ భార్యను ఇంకా కట్నం కోసం

హింస పెడుతున్నట్లు తెలిసింది. మొదటిసారి వార్నింగ్ ఇచ్చి క్షమిస్తున్నాము. ఇకమీదట నీ భార్యను మునుపటిలా బాధించినట్లు తెలిసిందంటే విన్ను, నీ తల్లితండ్రులను జైల్లో వేసి నీ భార్య అనుభవించిన నరకాని కన్నా వెయ్యిరెట్లు నరకాన్ని చూపిస్తాను. మర్యాదగా ఇకమీదటయినా మంచి భర్తగా నడుచుకుంటే బ్రతికిపోతావ్. నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుంటాము."

తన మీద ఎవరు రిపోర్టు చేసారో అడగాలనిపించినా భయం వల్ల అడగలేకపోయాడు. ఫోను పెట్టిన శబ్దం విని వణుకుతున్న చేతులతో ఫోను పెట్టేసి ముఖానపట్టిన చెమటను తుడుచుకొన్నాడు రంగనాథం.

మేనేజరు రంగనాథంను బాగా చివాట్లు పెట్టి ఆ తరువాత హితబోధ చేశాడు. చివరగా "ఈ క్షణం నుంచీ నువు మారాలి. ఇప్పుడే ఇంటికెళ్ళి ఇంతకుముందు నేను చెప్పిన విధంగా నడుచుకో" అంటూ పర్మిషన్ ఇచ్చి ఇంటికి పంపాడు.

నిజానికి మేనేజరు హితబోధ చేయడానికి ముందే అంటే ఫోనులో డి.ఎస్.పి. చెప్పింది విన్న మరుక్షణమే కట్నం కేసులో ఇరుక్కుంటే జైలులో పోలీసుల హింస-సంఘంలో చులకనగా చూడుట-ఉద్యోగానికి ముప్పు-మొదలగు వాటి గురించి వూహించిన రంగనాథం ఇక జన్మలో భా ర్యను హింసించను అన్న నిర్ణయానికి వచ్చాడు.

★ ★ ★

తమ కొడుకు రంగనాథం తమ ముందే కోడలు ఇందిర' దగ్గర క్షమాపణ కోరడం, ఇకముందుఎప్పటికీ బాధపెట్టనని ప్రమాణం చెయ్యడం, ఎవరో అజ్ఞాత వ్యక్తి డి.ఎస్.పి.కి మన గురించి ఫిర్యాదు చేసారంటూ మధ్యాహ్నం ఆఫీసులో జరిగిందంతా చెబుతూ 'ఇకమీదట ఇందిరను బాధపెట్టవద్దు' అంటూ ఇందిర ముందే చెప్పడం వారికి అవమానమనిపించింది. అంతేకాకుండా డి.ఎస్.పి. తమ గురించి కూడా చెప్పడంవల్ల కల్గిన భయంతో ఇక్కడుండడం మంచిది కాదనిపించింది. తల్లిదండ్రులు అప్పటికప్పుడే తమ గ్రామానికి బయలుదేరుతామని పట్టుబడితే రంగనాథం సరేనన్నాడు.

'తమ కుటుంబ విషయం డి.ఎస్.పి. వరకు ఎవరు తీసుకెళ్ళారు?' అన్న ప్రశ్న వారందరిలో జవాబు దొరకని ప్రశ్నయింది.

తల్లితండ్రులను బస్సు ఎక్కించడానికి రంగనాథం వారితో బయలుదేరాడు.

జరిగినదంతా చూస్తున్న ఇందిరకు సంతోషంగా వుంది. భర్త సినిమాలో లాగా డి.ఎస్.పి. ఫోను చేసిన వెంటనే మారిపోవడము ఆశ్చర్యంగా వుంది. పోలీసులంటే మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేరస్థులు ఎంతగానో భయపడుతారని తెలుసుకొంది. ఎవరో తన గురించి డి.ఎస్.పి.కి తెలియపరచి తన కష్టాల నుండి విముక్తి కలిగించడానికి కారకులైన ఆ అజ్ఞాత వ్యక్తికి మనసులోనే శతకోటి నమస్కారములు తెలుపుకొంది.



# "ఆఫ్రికన్ అవ్వ"

నేటి ఆధునిక మానవుని అసలు 'జన్మభూమి' ఆఫ్రికానా?

అమెరికాలో ఇటీవల జరిగిన 'ఆంత్రోపాలజిస్టుల' సమావేశం ఈ ప్రశ్నకు 'అవుననే' జవాబిస్తోంది మరి!

కొత్తగా లభించిన కొన్ని శిలాజాలు, ఇతర జీవశాస్త్ర సంబంధమైన సాక్ష్యాధారాలను బట్టి చూస్తే ఆధునిక మానవుల ఆవిర్భావం గత 2 లక్షల సంవత్సరాలలో ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలో జరిగి... ఆ తర్వాత వారు ప్రపంచంలోని అన్ని భాగాలకు వలస వెళ్లడం జరిగిందని విశదమవుతున్నట్లు శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

ఇటీవల "అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్ మెంట్ ఆఫ్ సైన్స్" సమావేశంలో పాల్గొన్న ఆంత్రోపాలజిస్టులు మానవ పరిణామక్రమానికి సంబంధించిన 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' సిద్ధాంతాన్ని కూడా చర్చించారు. నేటి మానవాళి సమస్తం 'సబ్-సహారన్ ఆఫ్రికా'లో నివసించిన ఒకే ఒక్క స్త్రీ నుంచి ఉద్భవించిన వారని ఈ 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' సిద్ధాంతం పేర్కొంటోంది. దీనిని కొందరు జన్యు శాస్త్రవేత్తలు ఇటీవల ప్రతిపాదించారు.

ఈ సిద్ధాంతం ప్రకారం 'ఆఫ్రికన్ అవ్వ' (ఈవ్)కు జన్మించిన మానవులు ఆఫ్రికా నుంచి వలస వెళ్లిపోయి గత లక్ష సంవత్సరాలలో యూరప్, ఆసియా అంతటా విస్తరించారని భావిస్తున్నారు.

కాగా ఆధునిక మానవులు తొలుత ఆఫ్రికాలో ఆవిర్భవించారన దాన్ని సమావేశంలో పాల్గొన్న ఆంత్రోపాలజిస్టులలో అధికభాగం అంగీకరించారు. అయిదు భౌగోళిక ప్రాంతాలైన ఆసియా, యూరప్, ఆస్ట్రేలియా, న్యూగినియాలకు చెందిన 147 మంది మహిళలకు సంబంధించిన 'మిటోకాండ్రియల్ డి.ఎన్.ఎ.' నమూనాలను విశ్లేషించిన అనంతరం జన్యు శాస్త్రవేత్తలు 'గార్డెన్ ఆఫ్ ఈవ్' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. కోతుల నుంచి మనిషి అవిర్భవించి 50 లక్షల నుంచి 60 లక్షల సంవత్సరాలవుతున్నదని భావిస్తుండగా...ఆధునిక మానవుని అవిర్భావానికి దోహదం చేసిన 'అవ్వ' పుట్టినతేదీ గత లక్ష సంవత్సరాల నుంచి 2 లక్షల సంవత్సరాలలో వుండ వచ్చునని జన్యు శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆఫ్రికాలో తొలి ఆధునిక మానవునికి సంబంధించిన శిలాజాలు ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలోని 'క్లాసీస్ రివర్ మౌత్ కేవ్' వద్ద లభ్యమయ్యాయని కూడా పరిశోధకులు తెలిపారు. ఇవి గత 80,000 నుంచి 115,000 సంవత్సరాల మధ్య కాలానికి సంబంధించినవని కూడా భావిస్తున్నారు.

[దీనిమీద - మన శాస్త్రాల ఆధారంగా విజ్ఞులెవరైనా క్లుప్తంగా ప్రతిస్పందన రాస్తే - ప్రచురణామోదం పొందినవాటిని వీక్లీలో వేస్తాము - ఎడిటర్]

# విముక్తి



అప్పుడే స్కూలు నుండి వచ్చిన సరిత "ఉదయం బడినందు జరిగిన ఫంక్షన్ నందు కలర్ పెన్సిల్ బాక్స్, ఓ బొమ్మల పుస్తకం నాకు బహుమతిగా ఇచ్చారు" అంటూ సంచి లోంచి సర్టిఫికేట్స్‌తోపాటు పెన్సిల్ బాక్స్, బొమ్మల పుస్తకాన్ని చూపించింది.

ఇందిరకు ఆనందంగా వుంది. 'ఈరోజు జీవితంలో మరిచిపోలేని రోజు. అన్నీ తనకు సంతోషం కలిగించే వార్తలే' అనుకొంది.

ఉదయం జరిగిన స్కూలు వార్షికోత్సవ సంగతులు చెబుతుంటే ఆనందంతో వింటోంది ఇందిర.

"అమ్మా, ఆ ప్రైజులిచ్చిన అంకుల్ ప్రైజులిచ్చిన తరువాత నన్ను 'గుడ్‌గర్ల్' అంటూ ముద్దుపెట్టుకొని 'సరితా నువ్వి లాగే బాగా చదివి ఎప్పుడూ ఫస్ట్‌రాంక్ వస్తూ వుంటే బోలెడన్ని ప్రైజులు, ఆడుకొనే బొమ్మలు ఇస్తారు' అన్నారు. అప్పుడు నేను 'అంకుల్ నేను బాగా చదివి ఫస్ట్ వస్తాను. అయితే నాకు ప్రైజులు వద్దు. బొమ్మలు వద్దు డబ్బులిస్తారా' అనడిగాను. 'ఎందుకమ్మా' అనడిగారు ఆ అంకుల్. 'మా తాతయ్య దగ్గర డబ్బులు లేవుగా! మా తాతయ్యకు బదులు నేను డబ్బులిచ్చానంటే మా అమ్మను ఎవరూ కొట్టరుగా' అన్నాను.

అమ్మా, ఆ అంకుల్ చాలా మంచి వారమ్మా. మీటింగ్ అయిపోయిన తరువాత నన్ను హెడ్‌మాస్టరు రూముకు పిలిపించి నాకు స్వీట్లు ఇచ్చి తినమన్నారు. అప్పుడు ఆ అంకుల్ 'మీ అమ్మను ఎవరు కొట్టారు? ఎప్పుడు కొట్టారు? ఎందుకు కొట్టారు' అంటూ అడిగారు. నేను అంతా చెప్పాను. ఆ అంకుల్ పేరు డి.ఎస్.పి. అంకుల్....."

అంతవరకు తన కష్టాల నుండి విముక్తి ప్రసాదించడానికి కారకులయిన దేవుడు ఎవరో అనుకొని పలువిధాల నమస్కరించిన ఇందిరకు- ఆ దైవం తన కూతురు సరితని ఇప్పుడు తెలిసింది. కృతజ్ఞత, ఆరాధన నిండిన కళ్ళతో చూస్తూ తన హృదయానికి సరితను గాఢంగా హత్తుకొని ముద్దులు కురిపించసాగింది.